నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 19 ఏప్రిల్ 2025 SIDDIPET

## భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి

- నేడు సిద్దిపేటలో విద్యార్థులకు అవగాహన సదస్సు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 18: వేసవిలో పిల్లలు సరైన మార్గంలో నడవాలనే ఉద్దేశంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి' అనే నినాదంతో శనివారం సిద్దిపేటలోని మెట్రో గార్డెన్‌లో పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. వేసవిలో ఈతకు వెళ్లవద్దు, బైక్‌లు నడపవద్దు, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి, ప్రాథమిక జీవన నైపుణ్యాలు తదితర విషయాలను పిల్లలకు నేర్పించాలనే ఉద్దేశంతో ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, చక్కటి దినచర్య, మంచి ఆహారం, యోగా, వ్యాయామం, కంప్యూటర్ కోచింగ్, ఇంగ్లిష్, ఇతర భాషలపై శిక్షణ, పుస్తకాలు చదవడం వంటి విషయాలపై విద్యార్థులకు ఆసక్తిపెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. సిద్దిపేట నియోజకవర్గాన్ని తన కుటుంబంగా భావిస్తానని, తన పిల్లల బాగోగులు చూసుకోవడానికి తనవంతుగా ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

## ఎల్కతుర్తి సభను సక్సెస్ చేద్దాం

- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి



రామాయంపేటలో 'చలో ఎల్కతుర్తి' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, ఏప్రిల్ 18: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రామాయంపేటలో ఆమె 'చలో ఎల్కతుర్తి' పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈసారి కచ్చితంగా అధికారంలోకి వస్తామని, రేవంత్ సర్కార్ వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా పాలన కాకుండా.. రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. రైతులను, ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన రేవంత్ సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాజ చంద్రం, ఉమామహేశ్వర్, నరేందర్‌రెడ్డి ఉన్నారు.



వెంకటాయపల్లిలో 'చలో ఎల్కతుర్తి' పోస్టర్ ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

## లక్షలాదిగా రజతోత్సవ సభకు తరలుదాం

- గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 18: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలుదామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాయపల్లి శివారులోని దేవత గార్డెన్స్‌లో, మధ్యాహ్నం తూప్రాన్‌లోని ఎస్‌వీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పదేండ్ల కేసీఆర్ పాలన స్వర్ణయుగమన్నారు. అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో హామీలను తుంగలో తొక్కి, ఆరు గ్యారెంటీలను విస్మరించిందన్నారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ వేడుకలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరుగెత్తే విధంగా నిర్వహించబోతున్నామన్నారు. ఊరూవాడల నుంచి ఉప్పెనలా గులాబీ దండు కదిలి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తూప్రాన్ మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏర్పుల లక్ష్మణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాఘువేందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ రాణీసత్యనారాయణ గౌడ్, నాయకులు మన్నె శ్రీనివాస్, చంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బజారు చక్రవర్తి, మాచిరెడ్డి కృష్ణారెడ్డి, బొడ్డు రమ్య, మామిడి వెంకటేశ్, దుర్గారెడ్డి, సత్యలింగం, సత్తార్, బురాన్, షబ్బీర్, పసుల నారాయణ, రమేశ్, సామల అశోక్, సిందె చంద్రం, గంగాధర్ వెంకటేశ్, మల్లికార్జున్‌గౌడ్, చింతల దశరథ, నాగరాజు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలంతా మళ్లీ కేసీఆర్ కావాలంటున్నారు..



నార్సింగిలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 18: యావత్ తెలంగాణ ప్రజలంతా మళ్లీ కేసీఆర్ కావాలంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా శుక్రవారం దుబ్బాకలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో దుబ్బాక మున్సిపల్, మండలం, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఏర్పాటు చేసిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ అని, రాష్ట్రం సాధించుకోవడంతో పాటు అభివృద్ధిలో తెలంగాణను దేశానికే మోడల్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ ప్రజల బలం, విశ్వాసం గల పార్టీగా బీఆర్ఎస్ ఉండటం గర్వకారణమన్నారు. పార్టీ ఏర్పడి 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రజతోత్సవ వేడుకలకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, కాంగ్రెస్ మోసాలు, ఆరాచకాలకు ప్రజలే స్వస్తి పలికే సమయం వచ్చిందన్నారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టుల నుంచి కనీసం సాగునీళ్లు సరఫరా చేయలేకపోయిందన్నారు. సాగునీటి సమస్యలతో పంటలు ఎండిపోయి, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో మనోహర్‌రావు, సతీశ్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, కైలాశ్, రవీందర్ రెడ్డి, కిషన్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, వంశీ, శ్రీనివాస్, వనితాభూంరెడ్డి పాల్గొన్నారు.

**బహిరంగ సభకు భారీగా తరలిరావాలి**

చేగుంట, ఏప్రిల్ 18: వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ బహిరంగ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని సూచించారు.

# కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

**నర్సాపూర్ మండలంలో 925 ఎకరాల్లో వరి పంట, 6 ఎకరాల్లో మామిడి తోట నష్టం**

- గురువారం సాయంత్రం కురిసిన వడగండ్లు
- దెబ్బతిన్న వరిపంట, నేలరాలిన మామిడికాయలు
- నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలి: బాధిత రైతులు



తిర్మలాపూర్‌లో వడగండ్లకు రాలిన వడ్లను బిక్కుబిక్కుమంటూ చూస్తున్న రైతు కంజర్ల పోచయ్య



బ్రాహ్మణపల్లి కొనుగోలు కేంద్రం వద్ద వడగండ్లకు తడిసిన వడ్ల కుప్ప

నర్సాపూర్, ఏప్రిల్ 18: ఆరుగాలం కష్టపడి చేతికొచ్చిన వరిపంట వనగండ్లకు నేలపాలయ్యింది. ఇంకో వారం రోజుల్లో ధాన్యాన్ని అమ్ముకొని నాలుగు పైసలు సంపాదించుకుందామనుకున్న అన్నదాతల నోట్లో వడగండ్లు మట్టిని కొట్టాయి. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పు ఓవైపు... వడగండ్ల వానతో నేలరాలిన ధాన్యం మరోవైపు రైతన్నలను గుండెపగిలేలా చేశాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భయంకరమైన వడగండ్లతో కూడిన భారీ వర్షం రైతన్నలను అతలాకుతలం చేసింది. భారీగా వడగండ్లు పడటంతో చేతికొచ్చిన వరి ధాన్యం నేలరాలింది. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతన్నలు నేలరాలిన ధాన్యాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం కుప్పలు సైతం తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు వేడుకుంటున్నారు. నర్సాపూర్ మండలంలో 925 ఎకరాల వరి పంట, 6 ఎకరాల మామిడి తోట దెబ్బతిన్నట్లు ఏవో దీపిక పేర్కొన్నారు.



నర్సాపూర్ ఈదురు గాలులకు ఎగిరిపోయిన డెయిరీ ఫామ్ రేకులు

### తెల్లారి కోద్దామనుకున్నా... అంతలోనే నేలపాలు

పంట చేతికొచ్చిందని తెల్లారి కోత కోద్దామనుకున్నా... తెల్లారేసరికి వడగండ్లతో అంతా నేలపాలైంది. రెండున్నర ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరిసాగు చేశా. గ్రామానికి సమీపంలో పొలం ఉండడంతో కోతుల బెడద విపరీతంగా ఉండేది. రాత్రింబవళ్లు పొలం వద్దనే ఉంటూ కాపలా కాశా. పంట పెట్టుబడి కోసం సుమారు రూ.70 వేలు ఖర్చయింది. అప్పు తీసుకొచ్చి మరీ పంట వేశా. గలగల ఉండే పంట ఒక్క రోజులోనే నేల రాలిపోయింది. వనగండ్లకు ఒక్క ఇత్తు లేకుండా రాలిపోయింది. తెచ్చిన అప్పులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం కనికరించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– కంజర్ల పోచయ్య, తిర్మలాపూర్, నర్సాపూర్ మండలం

## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 18: వడగండ్లతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, గిరిజన తండా, రుస్తుంపేట, పెద్దచింతకుంట, చిన్నచింతకుంట, లింగాపూర్, గొల్లపల్లి , తిరుమలాపూర్ గ్రామాల్లో వడగండ్ల వానతో నష్టపోయిన వరిపంటను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వడగండ్లతో సుమారు 900 ఎకరాల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని వెల్లడించారు. రైతులు ఎకరానికి రూ.30 వేలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నష్టపోయిన పంటలకు పంటబీమా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పంటలతో పాటు ఈదురుగాలులకు కరెంట్ స్తంభాలు, రేకుల షెడ్లు నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని డి మాండ్ చేశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ కో–ఆప్షన్ మాజీ మెంబర్ మన్సూర్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సత్యంగౌడ్, వంజరి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, కొండల్, నర్సింగ్, రైతులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన



శాలిపేటలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఏవో లక్ష్మీప్రవీణ్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18: వడగండ్లతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ పరిశీలించారు. మండలంలోని శాలిపేట తదితర గ్రామాల్లో 120 మంది రైతులకు చెందిన 70 ఎకరాల్లో వరి పంట వడగండ్లకు దెబ్బతిన్నదని తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. ఆయన వెంట ఏఈవో శేఖర్ ఉన్నారు.

## నష్టపోయిన రైతులను సర్కారు ఆదుకోవాలి

చేర్యాల, ఏప్రిల్ 18 : సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతంలో అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో వడగండ్లు, అకాల వర్షాల వల్ల రైతులకు తీవ్ర నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతుల వివరాలను సంబంధిత అధికారులు అడిగి తెలుసుకొని వారిని ఆదుకోవాలని ఆదేశించారు. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో పిడుగుపాటుకు గురై పాడిగేదెలు మృత్యువాతపడగా రైతులను ఫోన్‌లో పరామర్శించి వారిని అదుకునేందుకు కృషి చేస్తానన్నారు. చేర్యాలతో పాటు గ్రామాల్లో నిలిచిపోయిన కరెంటు సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

## వరదపాలైన ధాన్యం



చేగుంట మండలం మక్కరాజిపేటలో ధాన్యం నుంచి నీటిని తొలిగిస్తున్న రైతులు

చేగుంట, ఏప్రిల్ 18: మెదక్ జిల్లా చేగుంట మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. గ్రామాల్లో ఐకేపీ, సొసైటీల్లో ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్లు జరగలేదు. కురిసిన వడగండ్లకు ధాన్యం తడిసి నీటిపాలైంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## వడగండ్లతో అపార నష్టం

- రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించాలి
- శివ్వంపేట మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



పిల్లుట్లలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, ఏప్రిల్ 18: వడగండ్ల వానతో కోతకు వచ్చిన పంట దెబ్బతిని రైతులకు అపార నష్టం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పిల్లుట్ల, కొత్తపేట, రత్నాపూర్, అల్లీపూర్ గ్రామాల పరిధిలో వడగండ్లకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరుకాలం కష్టపడి పండించిన పంటలు కోత దశలో వడగండ్లతో నష్టపోవడం బాధాకరమన్నారు. బాధిత రైతులకు ఎకరాకు రూ. 25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం పంటల బీమా డబ్బులు కట్టకపోవడంతో నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. రైతులెవరూ అధైర్యపడొద్దని, రైతులకు నష్టపరిహారం అందించే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. వ్యవసాయాధికారులు మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు త్వరగా నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పెద్దపులి రవి, సుగుణాశ్రీనివాస్, బొగ్గుల యాదగిరి, చింతస్వామి, హంసాన్‌పల్లి నర్సింహారెడ్డి, ఏవో లావణ్య, ఆర్ఐ కిషన్, ఏఈవో మౌనిక, దామోదర్‌రెడ్డి, సంద్ర సుదర్శన్ ఉన్నారు.

## కంది సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

- అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



వెంకట్ (ఫైల్)

కంది, ఏప్రిల్ 18: సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ గుండెపోటుతో మృతిచెందాడు. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఇజ్మల వెంకట్(39) గంజాయి కేసులో నిందితుడిగా ఈనెల 3న కంది సెంట్రల్ జైలుకు వచ్చాడు. 17న గురువారం రాత్రి అతడికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. మళ్లీ అర్ధరాత్రి కింద పడిపోవడంతో పరీక్షించిన జైలు వైద్యులు వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం రిపోర్టు అనంతరం ఖైదీ మృతికి గుండెపోటు కారణమా, మరేదైనా కారణమా అనే విషయం తెలుస్తుందని వైద్యులు చెబుతున్నారు.

**అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు**

వెంకట్ మృతిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం సంగారెడ్డి దవాఖాన వద్దకు చేరుకున్న వారి రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. మృతదేహం వద్దకు తమను ఎందుకు పంపడం లేదని, మృతిపై అనుమానం ఉందన్నారు. ఒకరోజుముందు ములాఖత్‌లో వెంకట్‌ను కలిసి మాట్లాడామని, ఆరోగ్యంగా ఉన్నాడన్నారు.

# మార్కెట్‌కు మోక్షమెప్పుడో?

- బీఆర్ఎస్ హయాంలో రూ.4.50 కోట్లు మంజూరు
- నిధుల కొరత పేరుతో ఆగిన భవన నిర్మాణం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

**అసంపూర్తిగా తెల్లాపూర్ సమీకృత మార్కెట్**



సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ భవన నిర్మాణం

పటాన్‌చెరు, ఏప్రిల్ 18: ప్రజలకు అవసరమైన కూరగాయలు, మటన్, చికెన్, చేపలు, ఇతరత్రా వంట సామగ్రి ఒకేచోట లభించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధాన మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీకి సమీకృత మార్కెట్ మంజూరు చేసింది. రూ.4.50 కోట్ల నిధులు సైతం కేటాయించింది. కాగా, తెల్లాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. పిల్లర్ల పనులు చేసి నిధులు లేవని కాంట్రాక్టర్ మధ్యలో ఆపేశారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**విస్తరిస్తున్న తెల్లాపూర్**

తెల్లాపూర్ మున్సిపాలిటీ హైదరాబాద్‌కు సమీపంలో ఉంటుంది. ఇక్కడ అధికంగా ఐటీ ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. మున్సిపల్ పరిధిలోని కాలనీలు, గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయి. కొత్త కాలనీలు శరవేగంగా వెలుస్తున్నాయి. జనాభా విపరీతంగా పెరిగింది. గ్రామాలు సైతం శరవేగంగా అభివృద్ధి వైపు పరుగులు తీయడంతో మున్సిపల్ పరిధిని పెంచారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో నివాసముండే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు బీఆర్ఎస్ హయాంలో నాటి మంత్రి హరీశ్‌రావు కృషిచేశారు. ఇక్కడ సమీకృత కూరగాయల మార్కెట్ మంజూరు చేయించి రూ.4.50 కోట్లు కేటాయించారు. టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించగా, కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని పనులు మధ్యలో ఆపేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో తెల్లాపూర్ సమీకృత మార్కెట్ నిర్మాణానికి గ్రహణం పట్టింది. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం పక్కన జీప్లస్-2 విధానంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కూరగాయలతో పాటు మటన్, చికెన్, చేపలు అమ్మకాలు చేసేందుకు షాపుల నిర్మాణం ప్రారంభించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలవడంతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గూడెం మహిపాల్‌రెడ్డి ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ తెల్లాపూర్ సమీకృత మార్కెట్ పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ఎమ్మెల్యే సైతం సరిగ్గా దృష్టిపెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.


### జనరల్ ఫండ్‌కు ప్రతిపాదనలు పంపాం

తెల్లాపూర్ మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఆగిన సమీకృత మార్కెట్ పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. భవన నిర్మాణానికి రూ.4.50 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం. నిధులు కొరతతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేశారు. జనరల్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాం.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ తెల్లాపూర్

## ఇక్కడే చచ్చేటట్లు ఉన్న.. ఆదుకోండి సారూ..

- గల్ఫ్‌లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్య
- సోషల్ మీడియాలో కాపాడాలంటూ వేడుకోలు



వీడియో కాల్‌లో మాట్లాడుతున్న చొప్పరి లింగయ్య

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 18: అప్పుల బాధతో గల్ఫ్‌కు వచ్చిన సార్... కాళ్లనొప్పులతో లేవలేకపోతున్న.. పనిచేయలేక పోతున్న... ఇంటికి పోతనంటే పాస్‌పోర్టు లాక్కున్నారు. నన్ను కాపాడకుంటే ఇక్కడే చచ్చిపోయేలా ఉన్న, గల్ఫ్‌లో నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు... పదిహేను రోజులుగా కష్టాలు పడుతున్న... తిందామంటే తిండిలేదంటూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్య దుబాయిలో పడుతున్న కష్టాలను సోషల్ మీడియాలో వెల్లడించాడు. వివరాల్లోకి వెళితే... చొప్పరి లింగయ్య, రజితలకు ఇద్దరు కుమారులు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్న లింగయ్య కరోనా సమయంలో అనారోగ్యంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక దుబాయికి వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. గతంలో మలేషియాకు వెళ్లి పని చేసి వచ్చిన లింగయ్య మరోమారు విదేశాలకు వెళ్లి పనిచేసి అప్పులు తీర్చాలని భావించి రూ.1.50 లక్షలు వెచ్చించి వీసా తీశాడు. మార్చి 8న హుస్నాబాద్ నుంచి దుబాయిలోని షార్జాకు వెళ్లాడు. అక్కడ భవన నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో లింగయ్యకు అనారోగ్య సమస్యలు మొదలయ్యాయి. 15 రోజులుగా కనీసం కూర్చొన్న చోటు నుంచి లేవలేక ఇబ్బందులు పడుతున్నాడు. కాళ్ల నొప్పులు, భుజాలు లేవక పనికి సైతం వెళ్లలేకపోతున్నాడు. అనారోగ్య సమస్యలను సోనాపూర్ పవర్ కంపెనీ వాళ్లకు వివరించి తనను పంపించాలని వేడుకున్నాడు. కానీ వాళ్లు అతడిని పంపకుండా పాస్‌పోర్టు సైతం తీసుకోవడంతో షార్జాలోని తన గదికే పరిమితమయ్యాడు. తోటివారు దయతలిస్తే తప్ప వంట చేసుకునే పరిస్థితి లేక పస్తులతో గడుపుతున్న దీనావస్థను వీడియో కాల్‌లో 'నమస్తే తెలంగాణ'కు లింగయ్య వివరించాడు. తనను ఇక్కడి నుంచి కాపాడాలని, లేదంటే ఇక్కడే చచ్చిపోయేలా ఉన్నానని లింగయ్య కన్నీటి పర్యంతమవుతున్నాడు. లింగయ్యను హుస్నాబాద్‌కు రప్పించి ఆదుకోవాలని మాజీ కౌన్సిలర్ పెరుక భాగ్యారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.